క్లుప్తంగా

వాహనాల వేలం రేపు

సీతానగరం: ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్ సీతానగరం సర్కిల్ పరిధిలో వివిధ ఎక్సైజ్ నేరాల్లో సీజ్ చేసిన మూడు వాహనాలు (1, ఆటో,2, ట్రవేరా,3 మోటార్ సైకిల్స్) విజయనగరం ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ డిప్యూటీ కమిషనర్ ఆదేశాలమేరకు ఈనెల 6 గురువారం బహిరంగవేలం వేయనున్నట్లు సీఐ డి.పద్మావతి ఒకప్రకటనలో తెలియజేశారు. పార్వతీపురంలోని ఎక్సైజ్ స్టేషన్ ఆవరణలో వేలం నిర్వహించనున్నామని ఆసక్తి కలిగిన వారంతా నిర్దేశించిన సమయంలో ధరావతుతో వేలంలో పాల్గొనాలని కోరారు.

రహదారి నిర్మాణాల నాణ్యతలో రాజీ పడవద్దు

- అధికారులను ఆదేశించిన పీఓ అశుతోష్ శ్రీవాస్తవ

పార్వతీపురంటౌన్: పార్వతీపురం సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ పరిధిలో చేపట్టే సీసీ, బీటీ రోడ్ల నిర్మాణాల నాణ్యతలో రాజీ పడవద్దని ప్రాజెక్ట్ అధికారి, సబ్‌కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు పార్వతీపురం మండలంలోని హెచ్.కారాడవలస గ్రామంలో సీసీ రోడ్డు పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఐటీడీఏ పరిధిలో నిర్మించే రహదారి పనుల నాణ్యతాప్రమాణాల విషయంలో ఎటువంటి రాజీపడరాదని, పక్కాగా నిర్మించాలని అధికారులకు సూచించారు. ఇచ్చిన లక్ష్యాలను సకాలంలో పూర్తిచేసి అప్పగించాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలి

మక్కువ: క్యాన్సర్‌పై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని వైద్యారోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్‌మోహనరావు వైద్యసిబ్బందికి సూచించారు. ఈ మేరకు మక్కువ పీహెచ్‌సీలో మంగళవారం నిర్వహించిన ఆశాడే కార్యక్రమంలో ఆయన పాల్గొని, వైద్యసిబ్బందితో సమీక్ష చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రక్తహీనత నివారణ, పోషకాహారం ఆవశ్యకతపై అవగాహన పెంపొందించాలని సూచించారు. అనంతరం శంబర జాతరలో నిర్వహించిన వైద్యశిబిరాన్ని సందర్శించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ జి.హరికృష్ణ, డా.ఎస్.కిరణ్ కుమార్, డా.నిఖిల, ఎపిడమిక్ ఈఓ సత్తిబాబు, సీహెచ్‌ఓ నిర్మల, సూపర్‌వైజర్స్ రత్నం, జయగౌడ్ వైద్యసిబ్బంది తదితరులు ఉన్నారు.

మాపై తప్పుడు ఆరోపణలు సరికాదు



హక్కులకు సంబంధించిన పత్రాలను చూపిస్తున్న రైతులు

పార్వతీపురం: మా భూములను ఆక్రమించుకుని మాపై తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదని పెదబొండపల్లి, ఎమ్మార్‌నగరానికి పలువురు రైతులు పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్ వద్ద వారు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా తమ తాతముత్తాతల నుంచి సాగు, హక్కు అనుభవంలో ఉన్న భూములను పెదబొండపల్లి గ్రామానికి చెందిన చుక్క శ్రీదేవి ఆక్రమించుకున్నారని దేవాబత్తుల శ్రావణి ఆరోపించారు. అలాగే ఎమ్మార్‌నగరంలో రజకులకు కేటాయించిన దోబీఘాట్లను కూడా ఆక్రమించుకున్నారని ఆర్.ప్రభాకరరావు పేర్కొన్నారు. మా భూముల జోలికి వస్తే ఆందోళన చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు వి.త్రినాథనాయుడు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రథసప్తమి



చిలకలపల్లి వేణుగోపాలస్వామి ఆలయంలో స్వామివారి పాదాలను తాకిన సూర్య కిరణాలు



మక్కువ: పూజలు చేస్తున్న మహిళాభక్తులు

- స్వామివారి పాదాలను తాకిన సూర్యకిరణాలు

జిల్లా వ్యాప్తంగా రథసప్తమి పర్వదినాన్ని ప్రజలు భక్తిశ్రద్ధలతో మంగళవారం నిర్వహించారు. మహిళలంతా ఉపవాసాలు ఉండి సూర్య దేవాలయాలకు వెళ్లి పూజలు చేశారు. ఇళ్ల దగ్గర ప్రసాదాలు తయారు చేసి స్వామికి నైవేద్యం సమర్పించారు.

బలిజిపేట మండలంలోని చిలకలపల్లి వేణుగోపాలస్వామి ఆలయంలో స్వామివారి పాదాలను సూర్యకిరణాలు తాకడంతో భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. రథసప్తమి సందర్భంగా చిలకలపల్లి వేణుగోపాలస్వామి ఆలయంలో అర్చకుడు కె.రాంబాబు ఆధ్వర్యంలో భక్తులు పూజల్లో పాల్గొన్నారు. ఆదే సమయంలో సూర్యోదయమైన తరువాత సూర్యకిరణాలు స్వామివారి పాదాలనుంచి శిరస్సును తాకడంతో భక్తులు ఆ దృశ్యాన్ని పరవశించారు. మాఘశుద్ధ సప్తమి నుంచి ద్వాదశి వరకు సూర్యకిరణాలు స్వామివారి పాదాల నుంచి శిరస్సును తాకుతాయని అర్చకుడు రాంబాబు తెలిపారు. ఈ సమయంలో వివిధ గ్రామాల నుంచి భక్తులు వచ్చి దర్శనం చేసుకుంటారని తెలిపారు.

సూర్య నమస్కారాలపై అవగాహన అవసరం

రథసప్తమి సందర్భంగా బలిజిపేట మండలంలోని



గంగాడ యూపీ పాఠశాలలో సూర్యనమస్కారాలు చేస్తున్న విద్యార్థులు

గంగాడ యూపీ పాఠశాలలో ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు విద్యార్థులతో సూర్య నమస్కారాలు చేయించి వాటి ప్రాధాన్యం తెలియజేశారు. విద్యార్థులకు పాఠశాలలో వాటి ప్రాధాన్యం తెలియపరచడం ఎంతో అవసరమని అభిప్రాయపడ్డారు. పాఠశాల విద్యార్థులకు సూర్యనమస్కారాల ప్రాధాన్యం తెలియపరుస్తూ వాటిని ఏవిధంగా చేయాలనేది వివరించి చేయించారు. సూర్య నమస్కారాలు విద్య, ఆరోగ్యాన్ని అందిస్తాయని తెలిపారు. ప్రతి విద్యార్థి వాటిని నేర్చుకుని తీరాలని స్పష్టం చేశారు. రథసప్తమి పూజలు జరిపించి విద్యార్థులకు ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు. రథసప్తమి సందర్భంగా మక్కువ:మండలంలోని పలు గ్రామాల్లో భక్తులు సూర్యనారాయణమూర్తికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు తెల్లవారు జామునుంచి ఉపవాసాలు ఆచరించి, భక్తిశ్రద్ధలతో రథసప్తమి పూజలు చేశారు. పాలుపొంగించి, సూర్యనారాయణమూర్తి ఆలయాలకు వెళ్లి పూజల్లో పాల్గొన్నారు.

సూర్యపీఠంలో సూర్య జయంతి

పార్వతీపురం టౌన్: జిల్లా కేంద్రంలోని శ్రీ సూర్యపీఠంలో నమో భాస్కరాయ, నమో సూర్యదేవాయ అంటూ భక్తులు భక్తి పారవశ్యంతో రథసప్తమి పర్వదినం సందర్భంగా పరవశించిపోయారు. సూర్య జయంతిని పురస్కరించుకుని మంగళవారం ఉదయం 5 గంటల నుంచి శ్రీ సూర్యపీఠం నిర్వాహకుడు వేమ కోటి సరహరశాస్త్రి ఆధ్వర్యంలో రథసప్తమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయం 6 గంటలకు సుప్రభాత సేవతో ప్రారంభమైన దేవదేవుని పూజలు, ప్రాతఃకాలార్చన, స్వామివారికి క్షీరాభిషేకాలు భక్తులతో చేయించారు. ఉదయం 10 గంటల నుంచి ఉషా, పద్మినిఛాయా సమేత శ్రీ సూర్య భగవానుని కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా సాగింది. సాయంత్రం 6 గంటల నుంచి సహస్ర దీపాలంకరణతో పాటు శ్రీ సత్యసాయి సేవా సమితి సభ్యుల భజన కార్యక్రమం జరిగింది. అలాగే రాత్రి 7 గంటల నుంచి స్వామి వారి ఊంజల్, పూలంగిసేవలో భక్తులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న యోగా విన్యాసాలు



పార్వతీపురం టౌన్: యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీ సూర్యా యోగా సెంటర్ గురువు మోహన్ గంతాయత్ అధ్వర్యంలో యోగ విన్యాసాలు పలువురిని ఆకట్టుకున్నాయి. సూర్య నమస్కారాలతో పాటు పలు యోగా సెంటర్ విద్యార్థులు చేసిన విన్యాసాలు ఆహూతులను అబ్బురపరిచాయి.



పార్వతీపురం టౌన్: సూర్య భగవానునికి పూజలు చేస్తున్న భక్తులు



పార్వతీపురం టౌన్: స్వామి వారికి పూజలో వేమ కోటి సరహరశాస్త్రి

విద్యుత్ వినియోగదారులు సోలార్ ప్యానెల్ ఏర్పాటు చేయాలి

సీతానగరం: గ్రామాల్లో పెరుగుతున్న విద్యుత్ వాడకాన్ని దృష్టిలో ఉంచుకుని విద్యుత్ వినియోగదారులంతా సోలార్ విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన సోలార్ ప్యానల్ వేయించుకోవాలని ఎంపీడీఓ పి.త్రివిక్రమరావు అన్నారు. ఈ మేరకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈఓపీఆర్డీ కె.కుమారవర్మ అధ్యక్షతన జరిగిన పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ సహాయకుల సమీక్ష సమావేశంలో హౌసింగ్ లబ్ధిదారులను కలెక్టర్ ఆదేశాల మేరకు మండలాధికారులు సచివాలయ సిబ్బందికి లక్ష్యాలను నిర్దేశిస్తూ ఉత్తర్వులిచ్చారు. ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం ద్వారా ప్రతి ఇంటిపైన సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేయడానికి లబ్ధిదారులు రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు విద్యుత్ శాఖ సబ్ ఇంజినీర్ పాపారావు వివరాలను తెలియ జేశారు. గ్రామంలో 350 యూనిట్స్ దాటిన జాబితాను ఎంపీడీఓ కార్యదర్శులకు ఇస్తూ లక్ష్యాలను ఈ నెలాఖరుకు పూర్తి చేయాలని ఆదేశించారు. హౌస్‌హోల్డ్ సర్వే డేటాలో తప్పులున్నాయని వాటిని సరిచేసి డేటాను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశిస్తూ ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా జరుగుతున్న పనులపై సమీక్షించారు. సమావేశంలో హౌసింగ్ ఏఈ జానకిరాం, ఏపీఓ భాను పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ నాయకులపై అక్రమ అరెస్టులు అన్యాయం



పట్టణంలో మానవహారంగా ఏర్పడిన ఏఐఎస్ఎఫ్ నాయకులు, విద్యార్థులు

సాలూరు: ఏఐఎస్ఎఫ్ నాయకుల అక్రమ అరెస్టులు అన్యాయమని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రవికుమార్ అన్నారు. మెడికల్ కళాశాలను ప్రైవేటీకరణ చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తెలపడాన్ని నిరసిస్తూ, అన్నమయ్య జిల్లాలో ధర్నా చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులను అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని నిరసిస్తున్నామన్నారు. ఈ మేరకు సాలూరు పట్టణంలో పలువురు విద్యార్థులతో కలిసి ర్యాలీ, మానవహారం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థి సంఘాలపై తప్పుడు కేసులు పెడితే రానున్న రోజుల్లో ఈ ప్రభుత్వం భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. సత్యసాయి జిల్లాలో అక్రమ అరెస్ట్ చేసిన వారిని తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే రాష్ట్రవ్యాప్త ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు హరి, మణి, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీలో అవినీతిపై న్యాయపోరాటం

- ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల న్యాయసలహాదారు రేగు మహేశ్వరరావు



సాలూరు: జిల్లాలో ఉపాధిహామీ పథకంలో జరిగిన అవినీతి,అక్రమాలపై న్యాయపోరాటం చేస్తానని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల న్యాయసలహాదారు ,ప్రముఖ న్యాయవాది రేగు మహేశ్వరరావు స్పష్టం చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన సాలూరులో మాట్లాడుతూ ఎన్‌ఆర్‌ఈజీఎస్ చట్టానికి వ్యతిరేకంగా వెండర్‌ల పేరుతో ఊరుపేరు లేనివారికి పనులు అప్పగిస్తున్నారని విమర్శించారు. ఉపాధిహామీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్‌లను అడ్డదిడ్డంగా రాజకీయ ఒత్తిళ్లతో కొందరు అధికారులు తొలగిస్తున్నారని ఆరోపించారు. అంతేకాకుండా పలువురు సీనియర్ మేట్లను తొలగించడానికి కార్యాచరణను అధికారులు ప్రారంభించారన్నారు. అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం అమలును విస్మరించి, జిల్లాలో కొందరు అధికారులు, టీడీపీ నాయకులు రెడ్‌బుక్ రాజ్యాంగం అమలుచేస్తున్నారని విమర్శించారు. పనుల విషయంలో లేదా ఫీల్డ్ అసిస్టెంట్‌లు,సీనియర్ మేట్ల తొలగింపులో అన్యాయం జరిగితే తనను సంప్రదిస్తే, ఓ న్యాయవాదిగా అండగా నిలబడి న్యాయపోరాటం చేస్తానన్నారు.

రాజన్నదొరకు అభినందనలు

నియోజకవర్గంలో నాయకులు, కార్యకర్తలు, బాధిత ఉద్యోగులు, ప్రజలకు అండగా మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర అండగా నిలుస్తున్నారని ఇది చాలా అభినందనీయమన్నారు. ఆయన మాదిరిగానే అన్ని నియోజకవర్గాల్లో నాయకులు స్థానిక కార్యకర్తలు, ప్రజలకు అండగా నిలవాలని కోరారు.

ప్లాస్టిక్‌ను నివారిద్దాం..క్యాన్సర్‌ను తరిమేద్దాం

పార్వతీపురంటౌన్: ప్లాస్టిక్‌ను వాడడం వల్లనే క్యాన్సర్ బారిన పడవలసి వస్తోందని, ప్లాస్టిక్‌ను నివారించి క్యాన్సర్ వ్యాధిని జయిద్దామని ప్రైవేట్ మెడికల్ ప్రాక్టీషనర్స్-ప్రైమరీ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ పార్వతీపురం, విజయనగరం అసోసియేషన్ సభ్యులు పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం పట్టణంలో క్యాన్సర్ నివారణ కోసం అవగాహన ర్యాలీని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో ప్రతి పనికి ప్రజలు ప్లాస్టిక్ కవర్లను వాడడం అలవాటుగా మారిపోయిందని, దానికారణంగానే మనం క్యాన్సర్ బారిన పడవలసి వస్తోందన్నారు. ప్రధానంగా ఆహార పదార్థాలకు కవర్లు ఉపయోగించడం వల్ల ప్లాస్టిక్ తగలబెట్టడం వల్ల కాలుష్య కారక వాయువులు వెలుపడతాయన్నారు. ప్రధానంగా క్యాన్సర్, గుండెజబ్బులు, జీర్ణాశయం, పేగువ్యాధులు ఊపిరితిత్తులు, నరాల బలహీనత వంటి ఆరోగ్య సమస్యలు తలెత్తడానికి ప్రధాన కారణం క్యాన్సర్ అన్నారు. ప్లాస్టిక్ వాడకం వల్ల గొంతు, క్యాన్సర్ థైరాయిడ్, రొమ్ము, ఊపిరితిత్తులు, లివర్, గర్భాశయానికి సంబంధించిన క్యాన్సర్ వ్యాధులు రానున్నట్లు చెప్పారు. కావున ప్రజలు క్యాన్సర్‌పై పూర్తి అవగాహన కలిగి క్యాన్సర్ కారకాలైన ధూమపానం, మద్యపానం ప్లాస్టిక్ వాడకాలను అరికట్టి వారి ఆరోగ్యాన్ని క్యాన్సర్ బారిన పడకుండా కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నాగిరెడ్డి సింహాచలం, కార్యదర్శి నడిమింటి గోపాలనాయుడు, ఉపాధ్యక్షుడు వానపల్లి శంకరరావు, సహాయ కార్యదర్శి బీవీ నాయుడు ట్రెజరర్ బి.తులసీదాస్, జిల్లాలోని పార్వతీపురం, సీతానగరం, గరుగుబిల్లి, కొమరాడ, జియ్యమ్మవలస మండలాల కన్వీనర్లు, కో కన్వీనర్లు పాల్గొన్నారు.



పట్టణంలో ర్యాలీలో పాల్గొన్న ప్రైమరీ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విద్యాలయంలో ఘనంగా ఫేర్‌వెల్

సీతానగరం: మండలంలోని జోగింపేట డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల సంక్షేమ వసతిగృహ విద్యార్థులకు మంగళవారం ప్రిన్సిపాల్ జె. వి.ఎస్ మధుబాబు ఆధ్వర్యంలో ఫేర్‌వెల్ ఫంక్షన్ ఘనంగా జరిగింది. ఈ మేరకు వైస్ ప్రిన్సిపాల్ ఈశ్వరరావు విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ పలుప్రాంతాల్లోని గ్రామాల నుంచి వచ్చిన విద్యార్థులు అన్నదమ్ముల్లా వసతిగృహం, విద్యాలయంలో మెలగడం గొప్పవిషయమన్నారు. 2024-25 విద్యాసంవత్సరం ముగియనున్న కారణంగా ఇంతవరకు ఉన్న విద్యార్థులు ఫేర్‌వెల్ ఫంక్షన్ చేయాలని కోరడంతో ప్రిన్సిపాల్ ఇచ్చిన అవకాశం మేరకు సీనియర్, జూనియర్ విద్యార్థులంతా నృత్యప్రదర్శనలు చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఫైలేరియా నివారణ మందుల పంపిణీని విజయవంతం చేయాలి

- జిల్లా మలేరియా అధికారిణి మణి

బలిజిపేట: ఈనెల 10వ తేదీన మండలంలో అందరికీ ఫైలేరియా వ్యాధి నివారణ మాత్రలు పంపిణీ చేసి దగ్గరుండి మింగించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా మలేరియా అధికారిణి వై.మణి కోరారు. ఈ మేరకు బలిజిపేట పీహెచ్‌సీలో బలిజిపేట, అరసాడ, గలావల్లి పీహెచ్‌సీలకు చెందిన సిబ్బంది, ఆశ, అంగన్వాడీ కార్యకర్తలకు మంగళవారం ఆమె అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫైలేరియా నివారణతో పాటు ముందస్తు జాగ్రత్తలకు గాను డీఈసీ మాత్రలు పంపిణీ చేయాలని చెప్పారు. అందరికీ మాత్రలు పంపిణీ చేయడమే కాకుండా వాటిని మింగించాలని సూచించారు. ఎవరైనా ఆరోజు అందుబాటులో లేకుండా మిగిలిపోతే మరుసటి రోజున వారికి పంపిణీ చేసి మింగించాలని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి వినోద్, బలిజిపేట పీహెచ్‌సీ వైద్యాధికారిణి క్రాంతి కిరణ్మయి, గలావల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీనివాస్, అరసాడ వైద్యాధికారిణి మాధురి, వరల్డ్ హెల్త్ కన్సల్టెంట్ శిరీష సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న జిల్లా మలేరియా అధికారిణి మణి

రక్తహీనత నివారణ ధ్యేయంగా కృషి చేయాలి

పార్వతీపురంటౌన్: రక్తహీనత నివారణ ధ్యేయంగా కృషి చేయాలని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు పేర్కొన్నారు. ఈ మేరకు పార్వతీపురం మండలంలోని పెదబొండపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆయన సందర్శించి అక్కడ నిర్వహించిన ఆశాడే కార్యక్రమంలో పాల్గొని పలు సూచనలు, ఆదేశాలు జారీచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, కిశోరీ బాలికల్లో రక్తహీనత ఉన్నవారిని సత్వరమే గుర్తించి, హిమోగ్లోబిన్ శాతం వృద్ధి చెందేలా చర్యలు చేపట్టాలని, సంబంధిత శాఖల సమన్వయంతో సమష్టి కృషి చేయాలని సూచించారు. నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం ఐరన్ ఫోలిక్ ఆసిడ్ మాత్రలు క్రమం తప్పకుండా తీసుకునేలా నిశితమైన పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. పోషకాహారం సరిగా తీసుకునేలా చూడాలని చెప్పారు. ప్రస్తుతం కొనసాగుతున్న ఆరోగ్య సర్వేలు పూర్తిస్థాయిలో నిర్వహిస్తూ ఆరోగ్యసమస్యలు గుర్తించడంపై దృష్టి సారించాలన్నారు. క్యాన్సర్ స్క్రీనింగ్‌లో అనుమానిత లక్షణాలున్న వారిని గుర్తించాలని సూచించారు. కార్యక్రమంలో నోడల్ అధికారి డాక్టర్ ఎం.వినోద్, వైద్యాధికారులు డా.అనూష, డా.ధరణి, సీసీ శ్రీనివాసరావు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నాగభూషణరావు మాస్టారు సేవలు మరువలేనివి

సీతానగరం: ఉపాధ్యాయులు ఎదుర్కొనే సమస్యలను పరిష్కరించడానికి పి. నాగభూషణరావు మాస్టారు చేసిన ఉద్యమం నేటికీ మరువలేకున్నామని 'ఉపాధ్యాయ ప్రగతి ప్రధాన సంపాదకుడు కామ్రేడ్ జి.సత్యనారాయణ అన్నారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల క్యాంపెయిన్‌లో భాగంగా మంగళవారం పార్వతీపురం మన్యం జిల్లాకు విచ్చేసిన కామ్రేడ్ జి.సత్యనారాయణ ముందుగా సీతానగరంలో ఉంటున్న కీ.శే.కామ్రేడ్ పి నాగభూషణరావు ఇంటికి వెళ్లి ఆయన కుటుంబసభ్యులను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ ఉద్యమ నేత, మాజీ ఎమ్మెల్సీ కీ.శే.కామ్రేడ్ మార్పు బాలకృష్ణ సమకాలీకులు, సహచరులు, ఏపీటీఎఫ్ ఉద్యమ చరిత్రలో ఒక ప్రత్యేక స్థానం కలిగిన కామ్రేడ్ పట్నాయకుని నాగభూషణ రావు ఉపాధ్యాయ ఉద్యమం కోసం తమ జీవితాన్ని అంకితం చేశారని అన్నారు. సమాజ శ్రేయస్సు, ఉపాధ్యాయ సంక్షేమం కోసం తన 40 ఏళ్ల వరకు వివాహం సైతం మానుకొని కుటుంబానికి దూరంగా గడుపుతూ, ఉద్యమాల బాటపట్టి, జైలు జీవితాన్ని గడిపిన మహానేత అని కొనియాడారు. నాగభూషణరావు సేవలు చిరస్మరణీయమని ఏపీటీఎఫ్ ఎన్నటికీ మరువదన్నారు. ఈ సందర్భంగా నాగభూషణరావు కుమారుడు అరవింద్ వారి నాన్నగారు సేకరించిన ఏపీటీఎఫ్ రజతోత్సవ సంచిక(1972), పుస్తకాలను సంఘం బాధ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పువ్వల ధనుంజయరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దాసరి వెంకట నాయుడు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కామ్రేడ్ సత్యనారాయణ

పశువుల్లో రక్తహీనతను అరికట్టాలి లా..!

- పశు వైద్యాధికారి సూచనలు

బలిజిపేట: పశువుల్లో రక్తహీనతను ఎప్పటికప్పుడు గుర్తించి తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంది. రక్తహీనత నివారణకు పశువైద్యాధికారిని సంప్రదించి సూచనలు పాటించాల్సి ఉంటుంది. రక్తహీనత వల్ల రక్తంలో ఆమ్లజనకం సరఫరా తగ్గిపోతుంది. దీంతో పశువులు మేత మానేసి, పనిలో బలహీనత కలిగి ఉంటాయి. అంతేకాక ఎద్దులు, గేదెల రోగనిరోధక శక్తిపై ఇది ప్రభావం చూపుతుంది.

రక్తపోత(బ్లడ్ లాస్ అనీమియా)

ఫ్లక్స్, టిక్స్ వంటి బాహ్య, అంతర్గత పరాన్నజీవులు రక్తం పీలుస్తాయి. ఇది రక్తహీనతకు దారితీస్తుంది. ప్రమాదాలు, గాయాలు లేదా ఆపరేషన్ల సమయంలో రక్తం కోల్పోవడం వల్ల రక్తహీనత ఏర్పడవచ్చు. రక్తం పీల్చే కీటకాలు సోకడం వల్ల రక్తపోత జరుగుతుంది.

హేమోలిటిక్ రక్తహీనత

బాబెసియోసిస్, ఎర్లిబియోసిస్ వంటి వ్యాధులు ఎర్ర రక్తకణాలను ధ్వంసం చేస్తాయి. కొన్ని రసాయనాలు లేదా ఆహార పదార్థాలు(ఉదాహరణకు పత్తి విత్తనాలు) ఎర్ర రక్తకణాలను నాశనం చేస్తాయి.

నాన్-రెజెనరేటివ్ రక్తహీనత

ముఖ్యంగా ఇనుము, విటమిన్ బి12, ప్రోటీన్ వంటి పోషక లోపాలతో ఎర్ర రక్తకణాల ఉత్పత్తిని తగ్గిస్తుంది. కాలేయం, కిడ్నీలు సరిగా పనిచేయకపోవడం వల్ల ఎర్ర రక్తకణాల ఉత్పత్తి తగ్గుతుంది.



రక్తహీనతతో ఉన్న పశువు

లక్షణాలు:

- బలహీనత, అలసట
- తెల్లబడిన లేదా పసుపు కొమ్ములు
- మేత, నీరు తినే అలవాటు తగ్గిపోవడం
- శ్వాసకష్టం
- బరువు తగ్గడం
- పని సామర్థ్యం తగ్గిపోవడం

చికిత్స విధానాలు

అల్లోపతి:

- తీవ్ర రక్తహీనతకు రక్త మార్పిడి అవసరం కావచ్చు.
- ఇనుము లోపం కారణంగా రక్తహీనత ఉన్నప్పుడు ఇనుము సప్లిమెంట్స్ ఇవ్వాలి.
- కీటకాల నివారణ, పరాన్నజీవాల మీద కట్టడి చేయడం ద్వారా రక్తపూత నివారించవచ్చు.
- బాక్టీరియా లేదా పకిటీరియా సంక్రమణకు యాంటీబయాటిక్స్ ఇవ్వాలి.

నేచురోపతి:

- ఇనుము అధికంగా లభించే ఆహారం అందించాలి పచ్చకూరలు, ఆకుకూరలు ఆహారంలో చేర్చాలి.
- హెర్బల్ ట్రీట్మెంట్స్‌లో నెటిల్, స్పిరులినా వంటి ఇనుము అధికంగా ఉన్న ఉత్పత్తులు ఎర్ర రక్తకణాల ఉత్పత్తిని పెంచడంలో సహాయపడతాయి.
- ఆక్యుపంక్చర్ విధానం రక్త ప్రసరణను మెరుగుపరచంలో సహాయపడుతుంది.

హోమియోపతి:

ఫెర్రం ఫాస్ఫోరికం: రక్తహీనత ప్రారంభ దశలో ఉత్పత్తిస్థాయిలు పెంచడానికి ఉపయోగపడుతుంది.

చైనా అఫిసినాలిస్: రక్తపూత తర్వాత రక్తహీనత ఉన్న జంతువులకు ఇది ఇవ్వవచ్చు.

నాట్రం మురియాటికం: జిగురు తగ్గిన రక్తహీనతకు ఉపయోగపడుతుంది.

ఆర్సెనికమ్ ఆల్బమ్: తీవ్ర బలహీనత, శ్వాసకష్టం ఉన్న పశువులకు ఇది ఇవ్వవచ్చు

సరైన పోషకాహారం అందించాలి

"పశువులకు సరైన పోషకాహారం అందించాలి. ఏలికపాముల వల్ల రక్తహీనత వస్తుంది. బాహ్య పరాన్న జీవుల వల్ల కూడా వస్తుంది. మంచి పోషకాహారం అందిస్తూ, ఏలికపాముల మందులను ఎప్పటికప్పుడు పెట్టాలి. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి. వైద్యుల సూచనలు పాటించాలి.

– గణేష్, మండల పశువైద్యాధికారి, బలిజిపేట

హలో యువత కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

పార్వతీపురంటౌన్: యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలకోసం పోరాడుతున్న ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభలు 'హలో యువత చలో శ్రీకాకుళం' కార్యక్రమానికి కదిలిరావాలని ఏఐవైఎఫ్ నాయకుడు తోట జీవన్న పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం ఆయన పట్టణంలోని ఎన్‌జీఓ కార్యాలయంలో మాట్లాడుతూ ఈ ఏడాది జాబ్ క్యాలెండర్‌ను తక్షణమే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బాబు గెలిస్తే జాబ్ గ్యారంటీ అని కోటి ఆశలతో కూటమి ప్రభుత్వాన్ని యువత అందరూ గెలిపిస్తే, జాబు జాడైనా చెప్పకుండా ఎనిమిది నెలల కాలం పాటు కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. కూటమి పాలనతో నిరుద్యోగులు, ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులన్నీ వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ రాష్ట్రంలో నూతన పరిశ్రమలు రావాలన్నా, ఉద్యోగావకాశాలు కల్పించాలన్నా ప్రత్యేక హోదాను కేంద్ర ప్రభుత్వం ప్రకటించాలని డిమాండ్ చేశారు. డిమాండ్ల సాధనకు యువత అంతా కదిలి పోరాడాలని పిలుపునిచ్చారు. అందులో భాగంగానే హలోయువత చలో శ్రీకాకుళం అని పిలుపునిచ్చినట్లు చెప్పారు. ఫిబ్రవరి 6న జరిగే బహిరంగసభకు రాష్ట్రవ్యాప్తంగా యువత అంతా కదలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

పది విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలి



చిలకలపల్లి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సూచనలు ఇస్తున్న ఎంఈఓ-1 సామల

బలిజిపేట: పదవ తరగతి విద్యార్థులు రానున్న పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని ఎంఈఓ-1సామల సింహాచలం సూచించారు. ఈ మేరకు చిలకలపల్లి ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులతో ముఖాముఖి సంప్రదించి వారికి కొన్ని సూచనలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులంతా ఎఫ్ఏ 3పరీక్షలు ఏవిధంగా రాశారో అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేక తరగతుల నిర్వహణలో మీకు సబ్జెక్టుల వారీగా ఎటువంటి సమస్యలు ఉన్నా వెంటనే ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోవాలని సూచించారు. ఇంటివద్ద కనీసం మూడు గంటలపాటు చదువుకోవాలని చెప్పారు. పరీక్షల సమయంలో ఎటువంటి ఒత్తిడికి లోనుకాకూడదని హితవు పలికారు. మంచి రాత వల్ల మంచి మార్కులు సాధించవచ్చన్నారు. సెలవు రోజుల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించినప్పటికీ మధ్యాహ్నభోజనం ఉంటుందని తెలిపారు. వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టిసారించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.